# బహుమతి కథ

'పోస్ట్' అన్న కేక వినగానే ప్రాణం లేచివచ్చినట్లయింది అరుణకి. అరుణ దైనందిన కార్యక్రమాల్లో 'పోస్టు' కోసం ఎదురు చూడటం ఒకటి.

ఆంధ్రదేశంలో పేరు ప్రఖ్యాతులను గడించిన రచయిత్రి అరుణకి బంధుమిత్రుల కంటె వందరెట్లు సంఖ్యలో ఎక్కువగా ఉండి అంతకు రెట్టింపు అభిమానాన్ని పంచిపెట్టే పాఠకలోకం ఉంది. తన రచనలను పొగడుతూనో, తెగడుతూనో రకరకాల ధోరణులలో పాఠకులు వ్రాసే ఉత్తరాలు, "నేనో కథ (నవల)ను పంపిస్తున్నాను. దీనిని చదివి, తప్పులుంటే దిద్ది, ఆ పైన ఏ పత్రికకైనా పంపండి" అంటూ కొందరు యువ రచయిత(త్రు)లు పంపే రచనలు, సభలకీ, సమావేశాలకీ వచ్చే ఆహ్వాన పత్రికలు, ఊరూ పేరూ లేని వ్యక్తులనుండి వచ్చే పండగల శుభాకాంక్షలు, ముఖ్య-

మొహం తెలియని వ్యక్తుల పెళ్ళి శుభలేఖలు, రకరకాల ఉత్తరాలూ అరుణకి వస్తుంటాయి.

ఐతే అరుణలో ఒక దుర్గుణం ఉంది. అదేమంటే ఎవరైనా వ్రాసిన ఉత్తరాలను చదవటానికి ఎంత ఉత్సాహపడుతుందో, వాళ్ళ ఉత్తరాలకు జవాబివ్వటానికి అంత బద్ధకిస్తుంది.

అందుకే ఎప్పుడైనా "ఈరోజు ఉత్తరాలేం రాలేదే!" అని అరుణ బాధ పడుతుంటే "నువ్వెవరికైనా జవాబు వ్రాస్తే కదా నీకు ఉత్తరాలు రావటానికి!" అంటాడు ఆమె భర్త శేఖరం.

ఈ మధ్య అరుణ రచనా వ్యాసంగం కూడా కొంచెం కుంటుపడింది. అదేమని భర్త కారణం అడిగితే 'ఆ బెజవాడ పత్రికవాళ్ళు కథ వేసుకోవడమేగాని డబ్బు పంపరు. ఆ కాకినాడ పత్రికవాళ్ళు ఒకసారి నా నవలను తిప్పి పంపేరు కదా! అలాంటి పొగరుబోతు పత్రికకు నేను కదెందుకు పంపాలి ? ఆ మద్రాసు పత్రికవాళ్ళు కథను పంపిన ఏడాదికిగాని అచ్చువేయరు. హైద్రాబాదు పత్రికవాళ్ళు ప్రేమ కథలుతప్ప మరే కథలూ వద్దంటారు. ఇప్పటికే ప్రేమ కథలు వ్రాసీ వ్రాసీ బోరుకొట్టింది. ఇంకా ఎన్నని వ్రాయను?' అంటూ తాను రచనలు చెయ్యక పోవటానికి పత్రికలవాళ్ళే బాధ్యులన్నట్లు తేల్చి పారేస్తుంది అరుణ.

“బాగుంది వరస. పత్రికలవాళ్ళమీద అలిగి నువ్వు కథలు వ్రాయకపోతే నష్టం ఎవరికి? చెరువుమీద అలిగిన వాడి సామెతలా ఉంది నీ ధోరణి” అంటాడు శేఖరం.

ఏది ఏమైనా తాను చాలా గొప్ప రచయిత (త్రి)ననీ, తన గొప్పతనాన్ని ఎవ్వరూ గుర్తించవలసినంతగా గుర్తించటం లేదనీ ప్రతి రచయితా (త్రీ) బాధ పడేటట్లే అరుణకూడా బాధ పడుతోంది.

ఆ బాధలో ఆమెకు వ్రాయాలన్న ఉత్సాహం కూడా ఉండటంలేదు.

అందుకే ఈమధ్య ఆమెకు వచ్చే ఉత్తరాల సంఖ్య కూడా కొంచెం తగ్గింది.

అందుకే చాలా రోజుల తరువాత నిన్న పోస్టుమాన్ కేక కర్ణపేయంగా ఉంది అరుణకి. ఆనందంతో గుండె గంతులు వేస్తూండగా ఒక ఉదుటున వెళ్ళి వీధిగుమ్మంలో నిలబడింది అరుణ.

పోస్టుమాన్ ఆమె చేతికొక పొడుగాటి బ్రౌను రంగు కవరు అందించాడు.

అతను వెళ్ళిపోగానే లోపలికి వస్తూ కవరు తెరిచి చూసింది అరుణ. ‘ఫలానా పోటీకి ఉత్తమ రచనను ఎన్నిక చేసి పంపండి’ అంటూ ఒక సాహితీ సంస్థనుండి వచ్చిన ఉత్తరం అది.

అరుణకూడా ఒకప్పుడు ఆ సంస్థనుండి బహుమతి పొం దినరచయిత్రి.

కాని ఆనాడు బ హు మ తి ని స్వీకరిస్తున్నప్పటికంటె ఈనాడు ఆ బహుమతిని నిర్ణయించే జడ్జిగా ఉండటాన్నే గొప్ప విషయంగా భావించింది అరుణ.

ఇప్పుడు తనివ్వబోయే బహుమతివల్ల ఆయా రచ యిత(త్రు)ల పేర్లు సాహితీచరిత్రలో చిరకాలం నిల్చిపోవటమే కాక తగినంత నగదుకూడా ముడుతుంది. అందుకే నాలుగైదు పుస్తకాలువ్రాసిన ప్రతిరచయిత ఆ బహుమతికోసంఅర్రులు చూస్తూ ఉండాడు.

ఆ సంగతి అరుణకి అనుభవ పూర్వకంగానే తెలుసు.

అందుకే ఈ బహుమతిని నిర్ణయించటంలో నిష్పాక్షి కంగా శ్రద్ధగా వ్యవహరించాలని నిశ్చయించుకుంది అరుణ.

ఆ ఉత్తరం వచ్చిన మర్నాడే అనసూయమ్మ ఒద్ద ప్యూనుని వెంట బెట్టుకుని వాళ్ళయింటికి వచ్చింది. ఆవిడకి కూర్చోమని అరుణ మర్యాదలు చేస్తుండగానే ప్యూన్యాపిని పళ్ళ బుట్టను తీసుకువచ్చి లోపల పెట్టాడు.

ఎన్నడూలేని ఆ పద్ధతిచూసి అరుణ తికమక పడింది.

అనసూయమ్మ ఒక లాయరుగారి భార్య. ఆ లాయరు గారు కేసులు లేనప్పుడల్లా నాలుగైదు లైన్ల గేయాలలాటి రచనలు కాగితంమీద గీకి పారేస్తూంటారు. ఆ రచనలలో

సాహితీ విలువలు యేమాత్రం లేకపోయినా, ఆయన డిగ్రీలు హోదా చూసి పత్రికల వాళ్ళందరూ ఆయన గేయాలను ఎంతో భక్తిప్రపత్తులతో అచ్చు వేస్తుంటారు.

అలా అచ్చయిన పదమూడు గేయాలను తొమ్మిది పేజీలలో అచ్చువేసి దానికి ముగ్గురు మహాకవులచేత మొత్తం ఇరవై పేజీల ప్రశంసా వాక్యాలను వ్రాయించుకుని, దానికి తన పది పేజీల 'ముందుమాట'ను కలిపిఅడ్వర్టైజుమెంటులతో సహా ఒక అరవై పేజీల ఉద్గ్రంథాన్ని తయారుచేసేరు లాయరు గారు.

ఒక శుభ ముహూర్తాన ఆ ఉద్గ్రంథాన్ని మంత్రిగారి చేత ఆవిష్కరింపజేసి తెలుగు సాహితీ వనంలో ఒక పూల మొక్కను నాటామన్న సంతృప్తితో ఆరాత్రి నిద్రపోయారు.

ఆయన భార్య అనసూయమ్మ ఆ పుస్తకాన్ని తనే వ్రాసినంత యిదిగా పదిమంది ముందూ పొగుడుతూ తన భర్తని మించిన కవి తెలుగు దేశంలోనే లేడన్నట్లు మాట్లాడు తూంటుంది.

అరుణకి ఆమెతో పరిచయం ఉందిగాని అరుణకూడా రచయిత్రి అవటంవల్ల ఆమెను తన భర్తకి ప్రత్యర్థి గా భావించి ఆమెతో సరిగ్గా మాట్లాడేది కాదు. అలాటి అనసూయమ్మ గంపెడు పళ్ళు తెచ్చి రెండు గంటలసేపు హస్కుకొట్టి వెళ్ళే సరికి అరుణకి ఎంతో ఆశ్చర్యం వేసింది.

ఇంకా ఆమె ఆ షాక్ నుండి తేరుకోకముందే ఒక

మధ్యాహ్నంపూట ఏదో నవల చదువుకుంటూ పడుకుంది అరుణ.

బయట వీధి తలుపును ఎవరో తట్టినట్లయింది.

తలుపును తట్టే తీరునుబట్టి ఆయా వ్యక్తుల మనస్తత్వాన్ని కొంతవరకు ఊహింపవచ్చు నంటుంది అరుణ.

కొందరు దబదబ బాదుతారు తలుపుని. కొందరు లయబద్ధంగా తలుపు గొళ్ళాన్ని తలుపుకేసి కొడతారు. కొందరు తలుపును చేతి వేళ్ళతో సున్నితంగా మీటుతారు కొందరు బడిగంట కొట్టినట్లు ఆపి ఆపి కొడ్తారు. కొందరు సంకోచంగా మొహమాట పడుతున్నట్లు శబ్దం చేస్తారు.

ఇప్పుడామెకు వినిపించిన శబ్దం చివరి రకానికి చెందినది

"ఈ సమయంలో ఎవరువస్తారా?" అని ఆలోచిస్తూ తలుపు తీయటానికి బయటకు నడిచింది అరుణ.

ఎవరో మొదటిసారిగా తమ యింటికి వచ్చిన వ్యక్తులయివుంటారని ఆ మొహమాటంగా చేసిన తలుపు చప్పుడును బట్టి ఊహించుకున్న అరుణ తలుపుతీసి ఎదురుగా ఉన్న వ్యక్తిని చూసి అనుకున్నదానికంటె ఎక్కువగానే ఆశ్చర్యపడింది.

అతను — జయరాం!

తనని చూసి అతనెంత తొట్రుబడ్డాడో అతనిని చూసి ఆమెకూడా అంతగానే తొట్రుపడింది.

కాని ఎంతైనా రచయిత్రిగా అనేక రకాల వ్యక్తులతో

ఏర్పడిన పరిచయం వల్లను, సహజంగానే ఆమెది తన మనోభావాలను అంత త్వరగా బయటకు వెల్లడిచేయని స్వభావం కావటంవల్లను వెంటనే నిలదొక్కుకుని "రండి!" అంటూ గృహిణిగా అతని నాహ్వానించింది.

జయరాం సహజంగా నవ్వటానికి ప్రయత్నిస్తూ లోపలికి అడుగుపెట్టాడు.

"కూర్చోండి" అంటూ కుర్చీ చూపించింది.

అతను కూర్చున్నాడు.

"నన్ను గుర్తుపట్టేరా?" అనడిగేడు.

"మిమ్మల్ని గుర్తుపట్టలేక పోవటమేం?" అన్నది. నిజంగానే ఆమె అతి మామూలుగా అన్నది. కాని దానిని వెటకారంగా భావించి అతను ముఖం చిన్నబుచ్చుకున్నాడు

అతని ముఖం చూడగానే తన మాటలని అతను అపార్థం చేసుకోవడానికి అవకాశం ఉన్నదన్న విషయం జ్ఞప్తికి వచ్చింది. "అయ్యో! అలా ఎందుకన్నానా?" అని నొచ్చుకుంది.

"మిమ్మల్ని గుర్తుపట్టేను." అని సూటిగా సమాధానంయిస్తే బాగుండేదేమో అనుకుంది.

ఏ యిమైనాంటికివచ్చిన మనిషితో మనసు కష్టపడేలా మాట్లాడటం గృహిణి లక్షణం కాదని తనని తానే నిందించుకుంది.

అతనుకూడా తను చిన్నబుచ్చుకోవటాన్ని ఆమె గమనించటం యిష్టంలేనట్లు చిరునవ్వుతో "మిమ్మల్ని ఒకసారి చూసిపోదామని వచ్చేను. ఇక్కడకు దగ్గర్లోనే మా స్నేహితుడొకతను ఉన్నాడు. అతనిని చూసి వెళ్తూ యింత దూరం వచ్చేనుకదా మిమ్మల్నికూడా చూసినట్లుంటుంది అని వచ్చేను అన్నాడు.

ఆ రకం మాటలు జయరాం కాక మరే రచయితైనా అన్నట్లయితే ఆమెకంత అసహజత్వం ఏమీ కనపడేదికాదు.

కాని తన రచనలమీద ఏ మాత్రం గౌరవంలేని జయరాం-ఆ మాట లంటుంటే ఆనందానికి బదులు అనుమానమే కలిగింది.

"మీరేం వ్రాస్తున్నారిప్పుడు?" అనడిగింది. ఇద్దరు రచయితలు కలుసుకున్నప్పుడు వారిపలకరింపులలోతప్పనిసరిగా ఉండే ప్రశ్నే అది.

"ఆఫీసులో వర్కు ఎక్కువగా ఉందండీ! ఒక్కొక్కప్పుడు రాత్రిళ్ళుకూడా ఆఫీసులో పని చెయ్యవలసి వస్తోంది. ఇంక వ్రాయటానికి 'మూడ్', టైమూ రెండూ ఉండటం లేదు" అన్నాడు.

ఆ మాటల్లో "మీకేం—ఆడవాళ్ళు ఇంట్లో కూర్చుని చక్కగా పేజీలకు పేజీలు వ్రాస్తూంటారు. మాలాగా మీకొక ఆఫీసా ? పనా ? అన్న ఎగతాళి ధ్వనించినట్లయింది అరుణకి.

కానీ వెంటనే "ఛీ ! ఏమిటీ పాడు ఆలోచనలు ? నా యింటికి వచ్చి నన్నే ఎగతాళి చేస్తాడా ? అంత నామీద గౌరవం లేనివాడైతే అసలు నా యింటికి ఎందుకు వస్తాడు?" అని తన మనస్సుకు నచ్చచెప్పుకుంది.

కాసేపు సాహిత్యాన్ని గురించి అదీ యిదీ మాట్లాడు కున్నాక "టీ పెడ్తానుండండి" అంటూ వంటింట్లోకి వెళ్ళింది కరుణ.

ఐదు నిముషాల్లో రెండు కప్పుల టీ తీసుకువచ్చింది. టీ తాగేక మరో పది నిముషాలుండి వెళ్ళిపోయేడు జయరాం.

అతను వెళ్ళిన దగ్గరనుండీ అతనెందుకువచ్చాడా అన్న విషయాన్ని గురించే ఆలోచించ సాగింది అరుణ.

జయరాం వర్ధమాన రచయితలలో కాస్త పైకివచ్చే లక్షణాలున్న వారిలో ఒకడు. అతని కథలు అరుణ దృష్టిలో 'ఫరవాలేదు'. అందుకే ఒక సాహితీ సభలో తనతోపాటు వక్తగా ఆహ్వానింపబడి వేదికమీద కూర్చున్న అతనిని అభి మానంగా పలకరించింది.

కాని జయరాంలో తనాశించిన మర్యాద. వినయం ఏమీ కనిపించలేదు. పైగా నిర్లక్ష్యంగా తల బిరుసుగా ఉన్నట్లు కనబడ్డాడు.

అది తన అనుమానమేనేమో అనుకుని సరిపెట్టుకో బోయింది. కాని తీరా వేదికమీద అతనిచ్చిన ("దంచిన

అంటే యింకా బాగుంటుంది) ఉపన్యాసం విన్నాక ఆమెకు నిజంగానే వళ్ళు మండిపోయింది.

అతను గంటసేపు యిచ్చిన ఉపన్యాసంలో అరగంటసేపు ఆడ రచయిత్రులను తిట్టడానికే వినియోగించాడు. ఈ ఆడ వాళ్ళకసలు బుర్రలే లేవుట. వీరిలో సామాజిక స్పృహగాని, చైతన్యం గాని లేవుట. వట్టి వంటింటి కథలు లేదా గాలి మేడల కథలు తప్ప మరోరకం కథలు వ్రాయటం వారికి చేతకాదుట.

ఈ ఆడవాళ్ళు కలాలను కూర గరిటలు తిప్పినంత తేలికగా తిప్పి పారేస్తున్నారట. వాళ్ళవ్రాసే అడ్డమైన చెత్తా చదివి సమాజం నాశన మయిపోతోందిట. దేశం తగల బడిపోతోందిట. ఇదే ధోరణిలో రచయిత్రులను నోటికి వచ్చి నట్లల్లా దుయ్య బట్టి చివరలో మాత్రం "ఎవరో ఒకరిద్దరు రచయిత్రులు మాత్రంకాస్త "సెన్సిబుల్"గా అన్నాడు ఏదో దయతలచి అంటున్నట్లు.

"ప్రక్కన నా అంతగొప్పరచయిత్రిని పెట్టుకుని రచయి త్రులంతా ఎందుకూ పనికి రానివాళ్ళన్నట్లు మాట్లాడతాడా? ఎంత తల పొగరు యితనికి" అనుకుంది కసిగా.

"పోనీ అంటే అన్నాడు. 'ఫలానా రచయిత్రు'లంటూ ఎవరి పేర్లు చెప్పలేదు గదా అని సరిపెట్టుకుందాం. మరిచివర్లో "ఎ ఒకరిద్దరు రచయిత్రుల' అన్నప్పుడు 'అరుణగారి వంటి'

(28)

అన్న పదాన్ని కూడా చేర్చితే ఎంత మర్యాదగా ఉండేది. తన పేరుని ఆ ఒకరిద్దరు రచయిత్రులలో చేర్చలేదంటే అర్థం తను అంతకు ముందున్న అందరు రచయిత్రుల లాంటి దాని ననేగా' అనుకుంది ఉడుకు మోత్తనంగా.

అతని తరువాత తను మాట్లాడవలసిన ఉన్నట్లయితే తను కూడా ఆరచయిత్రుల కీర్తి ప్రతిష్ఠలను చూసి కుళ్ళుతూ విమర్శలు చేసే మగ రచయితలందరినీ దుయ్యబట్టేదే! కాని అప్పటికే తన ఉపన్యాసం అయిపోయింది.

ఇప్పుడు మళ్ళీ లేచి నిలబడి జయరాం మాటలను ఖండించటం సభామర్యాద కాదు. పైగా తమవాదోపవాదాలు చూసి ఆ సభను ఏర్పాటు చేసిన కార్యవర్గ సభ్యులు ఇబ్బందిలో పడవచ్చు. అందుకే ఎలాగో కోపాన్ని నిగ్రహించుకుని ముళ్ళ మీద కూర్చున్నట్లు కూర్చుంది అరుణ.

"పిడి బొంద కథలూ పీకూను. నాలుగైదుసార్లు పత్రికలలో తనపేరు అచ్చయేసరికి తనో పెద్దరచయితనై పోయేననుకుంటున్నాడు కాబోలు. రచయిత్రులను విమర్శించేతంటి మొనగాడి నయ్యాననుకుంటున్నాడు కాబోలు' అనుకుంది పళ్ళు నూరుకుంటూ - అంతకు ముందు గంట క్రితం వరకు తను అతని కథలను అభిమానించిన సంగతి మర్చిపోయి.

అలా ప్రథమ పరిచయంలోనే తమిద్దరి మధ్యా ఒకరకమైన సైన్ ఏర్పడిపోయింది.

'అలాంటివాడు ఇప్పుడు పని గట్టుకు ఇంటికి ఎందుకు వచ్చినట్లబ్బా!' అని ఒకటే తల్లబద్దలు చేసుకోసాగింది అరుణ.

శేఖరం ఆఫీసునుండి వచ్చేక 'జయరాం వచ్చేడివ్వాళ మధ్యాహ్నం' అని చెప్పింది అరుణ.

'ఎవరు? జయరామా? నీయింటి గడప తొక్కటానికి అతనికెన్ని గుండెలు? ఆ రోజు స్టేజీమీద నిలబడి 'మా' రచయిత్రులందరినీ తూర్పారబట్టిన జయరాం మనింటికి ఎందుకొచ్చినట్లు?' అని అతను కూడా ఆలోచించి తలనొప్పి తెచ్చుకున్నాడు.

చివరకి ఆ రాత్రి కలలో కూడా 'జయరాం ఎందుకొచ్చినట్లు? అన్న ఆలోచనతోనే సతమత మయిపోయింది ఆమె మెదడు. అర్ధరాత్రి మెలకువ వచ్చినప్పుడు హఠాత్తుగా ఆమెకొక ఊహతట్టింది. తను ఆ సాహితసంస్థ నిర్వహించే పోటీలో జడ్జిగా ఉన్నట్లు తెలుసుకొని యిటీవల వెలువడిన అతని కథల సంపుటి 'రక్తపు మంటలకి' బహుమతి వచ్చేటట్లు చూడమని అడగటానికి వచ్చాడేమో!

తనతో మంచిగా ఉంటే కనీసం తనకి ఒకసారి కనబడినట్లయితే తన కథల సంపుటి గుర్తుకు వచ్చి తను చదువుతుందని భావించాడేమో!

ఇది తప్ప అతను తమ యింటికి రావటానికి వేరొక కారణం కనబడటం లేదు. అనసూయమ్మ తెచ్చిన పళ్ళగంప

లోని అంతరార్థంకూడా అదే అయి ఉండవచ్చునన్న ఆలోచన కూడా అప్పుడే కలిగింది అరుణకి.

మరో రెండురోజుల తరువాత రామారావు అనే కవి ఒక బరువైన చేతి సంచితో అరుణా వాళ్ళ యింటికి వచ్చేడు.

అప్పుడు శేఖరం యింట్లోనే ఉన్నాడు.

ఆ కవి రాక దంపతులిద్దరినీ సంభ్రమాశ్చర్యాలలో ముంచివేసింది.

రామారావుని గొప్ప కవిగా అరుణ చిన్నతనం నుండి ఎరుగును. ఐతే ఆయన కవిత్వం చదవటం, దూరంగా కూర్చుని సభలలో ఆయన ఉపన్యాసాలు వినటమే తప్ప అరుణకి ఆయన పరిచయ భాగ్యం కలగలేదు.

రామారావు దృష్టిలో పద్యాలు వ్రాసేవాళ్ళే గొప్పవాళ్ళు. కథలు, నవలలు వ్రాసే రచయితలు మనుషులే కారన్నట్లు మాట్లాడతాడు. "అదికూడా సాహిత్యమేనా" అంటూ వెటకారంగా మాట్లాడతాడు.

తెల్లవాళ్ళు మన దేశాన్ని పాలించటం వల్ల కలిగిన అనర్థాలలో యీ కథలు, నవలలు దిగుమతి అయి సాహిత్యాన్ని నాశనం చెయ్యటంకూడా ఒకటి అన్న వృధాభిప్రాయం రామారావు కుంది.

అందుకే (అరుణలాంటి) అధునిక రచయిత (త్రు)లు ఎదురైనప్పుడల్లా అతను కళ్ళుపైన పెట్టి నడుస్తుంటాడు.

అలాంటి మహాకవి తమ యింటిని వెతుక్కుంటూ రావటం ఆశ్చర్యమే మరి!

వస్తూనే ఆయన ఎన్నాళ్ళగానో ఆ యింటితో పరిచయం ఉన్నవ్యక్తిలాగా గలగల మాట్లాడసాగేడు.

"ఆహా! ఆదర్శ దంపతులంటే మీరే! మీ యిద్దరూ లక్ష్మీ నారాయణుల్లాగా కలకల లాడుతూ యిలాగే జంటగా జీవించాలి" అంటూ సీస పద్యమో ఏదో (అరుణ ఛందస్సు మర్చిపోయి చాలా ఏళ్ళయింది) అశువుగా చదివేడు.

అరుణ రచనలను మెచ్చుకుంటూ ఆమె ముఖంమీదనే చాలామంది పొగుడ్తూంటారు. కాని యీయన అలా కాకుండా తమ యిద్దరినీ దంపతులుగా కలిపి పొగుడుతూ దీవించటం అరుణకి ఎంతో ఆనందాన్ని కలిగించింది.

ఆమె ఎంతో సంతృప్తిపడి పిల్లలకోసం తెచ్చినపళ్ళు బిస్కట్లు అన్నీ పెద్ద ప్లేట్లోపెట్టి ఆ కవిగారికిచ్చింది. ఆయన వాటన్నిటినీ ఒక్కటికూడా మిగల్చకుండా సుష్టుగాతిని మరో మారు ఛదోబద్దంగా ఆ దంపతలను ఆశీర్వదించేడు.

తరువాత తన సంచిని తెరచి దాదాపు ఇరవై పుస్తకాలను బయటకు తీశాడు. అందులో మూడు సంప్రదాయాను సారంగా వ్రాసిన నాటకాలు, మిగతావన్నీ ఖండకావ్యాలు.

ఒక్కొక్క పుస్తకాన్నీ తీసి దాని విశిష్టతను గురించి పది నిమిషాల చొప్పున మాట్లాడాడు.

చివరకి చల్లకొచ్చి ముంత దాచటం ఎందు కను కున్నాడో యేమో, "అమ్మా! అంతా నీమీద, ఆ పరా త్పరుడి మీద భారం వేసేను. నన్ను పాలముంచినా నీట ముంచినా మీరిద్దరే? నాకంటె ఎంతో వెనక పుట్టినవాళ్ళు. నాదగ్గర ఓనమాలు నేర్చుకున్న వాళ్లు కూడా ఆ 'బహు మతి'ని గద్దల్లా తన్నుకుపోయారు. నేనా పెద్ద ముండావాడిని ఏ క్షణాన ఊడతానో తెలియదు. కన్ను మూసేలోగా యీ 'బహుమతి'ని పొందేనంటే ధన్యుణ్ణవుతాను. పైగా ఆర్థి కంగా యిబ్బందుల్లో వున్నాను. ఉన్న ముగ్గురు కొడుకులూ పెళ్ళాలనేసుకుని వేరింటి కాపరాలు పెట్టేరు. నేనంటేనే వాళ్ళకు గిట్టదు. పెళ్ళిల్లు చేయటానికి యిద్దరు కూతుల్లు న్నారు. వాళ్ళకు మొగుళ్ళ నెలా కొనుక్కురావటమా అని రాత్రిం బవల్లు నాకు ఒకటే ఆలోచన... ఏదో నీ దయవల్ల ఈ బహుమతివస్తే, నా సంసారాని ఓ కొలిక్కి తెచ్చిన దాన నవుతావు. నువ్వు నా కూతురు వయస్సు దానివి కనుక నీ కాళ్ళు పట్లుకోలేను. ఆడపిల్లలు కనుక చేతులు కూడా పట్టుకోలేను. అందుకే మీ దంపతులిద్దరికీ కలిపి లక్ష్మీనారా యణలకు మొక్కినట్లు చేతులుజోడించి నమస్కరిస్తున్నాను. నా మీద కనికరం చూపించండి" అంటూ అదే తీరున అంత పెద్దమనిషీ చెప్పుకుపోతుంటే అరుణ మనస్సు ద్రవించి పోయింది.

కళ్ళ వెంబడి నీళ్ళెక్కడ వస్తాయోనని భయపడింది. ఎలాగో తనని తాను నిగ్రహించుకుంది.

ఆయన వెళ్ళిపోయిన తరువాత ఒకరోజుల్లా అరుణ, శేఖరం ఆయన గురించే మాట్లాడుకున్నారు.

మంచో చెడో, పాతో క్రొత్తో ఏదో ఒకటి కవిత్వం వ్రాస్తాడాయన. అది నిజంగానే మనిషికి జన్మతో అలవడిన విద్య. కాని ప్రతిభావంతులను పోషించిలేని దేశం మనది. ఎంతటి ప్రతిభా శాలియైనా సహజంగా డబ్బులేని వాడైతే తప్పనిసరిగా దారిద్ర్యాన్ని అనుభవించవలసిందే. ఆయన టాలెంటును మెచ్చుకుని ఆయనకి ఆర్థికంగా సాయపడటానికి యిటు ప్రభుత్వంగాని, అటు ప్రజలుగానీ ముందుకురారు.

ఇతర దేశాలతో పోల్చిచూస్తే సాహిత్య విషయంలో భారతదేశమంత దౌర్భాగ్య దేశం మరొకటి లేదని చెప్ప వచ్చు. అందునా తెలుగుదేశం మరింత దరిద్రగొట్టు స్థితిలో ఉంది.

పబ్లిషర్లు, పత్రికలవాళ్ళూ రచయితల ప్రతిభా సంపత్తినీ, వారు రక్త మాంసాలను ఖర్చుచేసి వ్రాసిన కళా ఖండాలను అమ్మి డబ్బుచేసుకుని అంతస్తులపైన అంతస్తులు కడుతూ, ఎయర్ కండిషన్డు గదులలో ఖుషీ చేస్తుంటే ఆ రచయితలు మాత్రం పదీ పరకా అందుకుని ఒకరోజు బియ్యానికో, ఒక చీటీ గుడ్డకో కలిసి వచ్చినాయని సంతృప్తి పడతారు. వాళ్ళ బ్రతుకులు మాత్రం ఎన్ని రచనలు చేసినా ఈగలు ముసిరే యిళ్ళల్లో కటకటలాడే నిత్యావసరాలలోనే గడిచిపోతుంటాయ్.

దానికి నిదర్శనం యీ రామారావుగారే! వేరే ఉద్యోగం లేకున్నా కేవలం తమ రచనలమీద రచయితలు జీవించగల బంగారు దినాలు తెలుగు సాహితీ ప్రపంచానికి ఎప్పుడు వస్తాయో కదా అని నిట్టూర్చింది అరుణ.

ఇదివరకు కవిగా రామారావు గారిని అభిమానించినా ఒక వ్యక్తిగా అతని మనస్తత్వాన్ని యిష్టపడేది కాదు అరుణ. అలాంటిది తమ యింటికి ఒక గృహస్తుగా వచ్చి తన సాధక బాధకాలను చెప్పుకునే సరికి ఆయన యెడల హృదయంలో ఒక 'సాఫ్ట్‌కార్నర్' ఏర్పడి పోయింది.

ఆయన రచనలు ఎలా ఉన్నాయో చదవక ముందే 'పాపం! ఆయనకి యీ బహుమతి యిప్పిస్తే ఆయన ఆఖరి దినాలలో కాస్త హాయిగా జీవిస్తాడు. కదా!' అనుకుంది స్త్రీ సహజమైన దయా హృదయంతో, కాని అంతలోకే ఆమె లోని వివేకం మేల్కొంది. 'ఈ బహుమతి ఒక పవిత్రమైన ఉద్దేశ్యంతో ఏర్పాటు చేయబడింది. కేవలం రచయిత యొక్క ప్రతిభకు గుర్తింపుగా యీ బహుమతి యివ్వబడుతోందే తప్ప అతనియొక్క ఆర్థిక, సాంఘిక స్థితి గతులలో దానికి సంబంధం లేదు. వాటితో సంబంధం ఉన్నట్టయితే తన మట్టుకు తనకే ఆ బహుమతి ఒకప్పుడు వచ్చి ఉండేది కాదు." అనుకుంది.

ఇంకొక రోజున ఒక మాగజైన్ ఎడిటర్ వచ్చేడు. ఆయన ఏభై యేళ్ళ జీవిత కాలంలోను వ్రాసింది ఒకే ఒక్క

నవల, నవలకు ఎప్పుడో ఒక పత్రిక నిర్వహించిన దీపావళి పోటీలో మూడవ బహుమతి వచ్చింది. దాంతో కొంతమంది ఆయనను రచయితగా మార్చి పారేసారు. ఒక పేరులేని పత్రిక వాళ్లు ఆయనను ఎడిటర్ గా కూడా తీసుకున్నారు.

అతను తిప్పి పంపించిన రచనలలో అరుణ కథలు కూడా ఒకటి, రెండు ఉన్నాయ్. తన కథలను తిప్పి పంపినం దుకు ఆ ఎడిటరు మీద కక్షగానే ఉంది అరుణకి. కాని అతని ముఖ పరిచయం లేనందున అతను స్వయంగా వచ్చి 'నేను ఫలానా' అంటూ పరిచియం చేసుకునే సరికి నిశ్చేష్టు రాలయింది.

తన ఏకైక నవలకు బహుమతి యిప్పిస్తే తనపేరు సాహితీ ప్రపంచంలో చిరస్థాయిగా నిలిచి పోవటమే కాక కాస్తోకూస్తో తన ఆర్థిక స్తోమత పెరుగుతుందన్న ఆశ. అంతే కాదు. ఆయన యింక జన్మలో కలంపట్టి స్వతంత్ర రచనలు చెయ్యలేదు. అతనిలోని సృజనాత్మక శక్తి దీపావళి పోటీలో తన నవలకు బహుమతి వచ్చిన మర్నాడే చచ్చిపోయింది.

చిన్ననాటి నుండి తనకి తెలిసిన విషయాలు, ఊహిం చుకున్న విషయాలు. పుస్తకాలద్వారా పొందిన విజ్ఞానం జీవితం యిచ్చిన అనుభవాలు అన్నీ కలబోసి వ్రాసేడు ఆ నవలలో ఇంక వ్రాయటానికి అతనిలో యేం మిగలలేదు. అతని ఉద్యోగం, అతనిని ఒక మనిషిగా, వ్యర్థుడిగా తయారు చేసినాయ్.

అందుకే ఎలాగైనా తనకు బహుమతి యిప్పించ మంటూ ప్రాధేయపడ్డాడు.

'మీరీ మధ్య మా పత్రికకు ఏమీ పంపటం లేదే! మీ లాంటి జీనియస్‌లు తెలుగు రచయితలతో నూటికి ఒక్కరుకూడా ఉండరంటే అతిశయోక్తి కాదు. మీ నవలను అచ్చు వేయటమే మహా దౌర్భాగ్యంగా భావిస్తాము మేము' అ కూడా అన్నాడు.

అరుణ మౌనంగా అన్నీ విన్నది. అరుణ అతను వెళ్ళి పోయాక 'నీపొగడ్తలకు నేను ఉబ్బి పోతాననుకున్నావురా చిట్టినాన్నా! నేను ఎంత ఆడదాన్నినైనా రచయిత్రిని నాయనా! నువ్వు మభ్య పెట్టడం అంత తేలికైన విషయం కాదు.' అను కుంది.

ఒకరోజు ప్రఖ్యాత నవలా రచయిత్రి శారదాదేవి అరుణకి ఫోనుచేసింది. 'హలో! బాగున్నారా? ఈమధ్య యేమీ వ్రాయటంలేదే, మీలాంటి జీనియస్సులే 'డల్'గా ఉంటే యిక మాబోటి రచయిత్రులం యేం వ్రాస్తాం? నిజం చెప్పాలంటే మేము పాఠకుల కోసం రచనలుచేస్తే మీరు మాలాటి రచయిత్రుల కోసం రచనలు చేస్తారు'... అంటూ ఏకధాటిగా అరగంటసేపు ఫోనులో మాట్లాడింది శారదాదేవి.

సమయం సందర్భం లేకుండా ఫోనుచెయ్యటం అరుణ కెంత ఆశ్చర్యాన్ని కలిగించిందో ఆమె మాట్లాడిన తీరుకూడా అంతకన్న ఎక్కువ ఆశ్చర్యాన్నే కలిగించింది.

ఒకసారి తను ఒక పత్రికలో 'ఈ నాటి తెలుగు రచయిత్రులు కేవలం సినిమాలను దృష్టిలో ఉంచుకుని అతి

...నమైన, అసహజమైన రచనలు చేస్తున్నారనీ, సాహిత్యం యొక్క స్థాయిని దిగజారుస్తున్నారనీ' అర్థం వచ్చేలా ఒక వ్యాసం అచ్చయిన మరుచటి వారమే 'అబ్బో! అంతటి గొప్పరచయిత్రని నేనొక్కదాననే అనుకుంటున్నానేమో, మా కంటె గొప్ప రచనలు నువ్వు ఏం చేసేవో, సాహిత్యం స్థాయిని నువ్వు ఏమాత్రం పెంచావో మాకు మాత్రం తెలియదా' అంటూ పక్కా ఆడదానిలా కయ్యం పెట్టుకుంటున్నట్లు పత్రికా ముఖంగా ఒక పెద్ద ఉత్తరం వ్రాసింది శారదాదేవి.

అలాటి రచయిత్రి తనతో అంత సారస్యంగా మాట్లాడటం అంతరార్థాన్ని గ్రహించలేని అమాయకురాలేం కాదు అరుణ. శారదాదేవి పదిహేను సంవత్సరాల కాలంలో సృష్టించిన డబ్భైమూడు కళా ఖండాలలో దేనికో ఒకదానికి బహుమతి యిప్పించమని ఆమె అభ్యర్థన!

ఇలా రకరకాల అనుభవాలు జరిగిన తరువాత 'కాన్ఫిడెన్షియల్' అని తాటికాయంత అక్షరాలతో ముద్రించబడి తన దగ్గరకు వచ్చిన సందేశం యిలా బట్టబయలు ఎలా అయిందో అర్థం కాలేదు అరుణకి

ఈ దౌర్భాగ్యపు దేశంలో అడ్డదారులు లేని రంగం యేముందిలే అనుకుంది విరక్తిగా.

బహుమతిని నిర్ణయించేటప్పుడు ప్రత్యక్షంగానో తనని 'అప్రోచ్' అయిన వారి రచనలు ఎంత గొప్పవైనా సరే-వాటిని పరిశీలించ కూడదని గట్టిగా నిశ్చయించుకుంది అరుణ.

నిజానికి వాళ్ళు తనని అప్రోచ్ కాకపోతే వా
ఒకరికి తప్పకుండా బహుమతి యిచ్చి ఉండేదేమో! ఎందు కంటే తన దగ్గరకి వచ్చిన వాళ్ళలో కొందరు నిజంగానే గొప్ప రచయితలు, కవులు వున్నారు.

కాని సాహితీ పరంగా వాళ్ళ రచనలు ఎంత గొప్ప వయినప్పటికీ తను అల్ప బుద్ధితో వారు తమ రచనలకే కళంకం తెచ్చుకున్నారు. అందుకే చస్తే అలాంటి వారి రచనలకు బహుమతులు లభించకూడదు అనుకుంది అరుణ.

చివరికెలాగో అతంగా పేరు లేకపోయినా, వ్రాసి కొద్దిరచినలూ ఉన్నంతగా ప్రయోజన కరంగాచేసిన ఒకయువ రచయిత కథల సంపుటికి బహుమతిని యిచ్చింది అరుణ తీరా తన అభిప్రాయాన్ని పోస్టుచేసిన తరువాత ఆమెకు మరో ఆలోచన వచ్చింది. 'తన దృష్టిలో గొప్ప వారైన ఆ రచయితలు గనుక అలా చిన్నతనంగా ప్రవర్తించకపోతే ముక్కూ-మొహం తెలియని యీ యువ రచయిత దాకా యీ బహుమతి వెళ్ళేది కాదేమో' నని.

అంతలోకే చటుక్కున 'ఐతే క్రిందటిసారి నాకువచ్చిన బహుమతికూడా కేవలం నా'పరు'ను బట్టిగాక యీ రకంగా తను ఈయువ రచయిత కిచ్చిన పద్ధతిలోనే రాలేదు కదా! అన్న ఆలోచన కూడా ఆమె మనసులో ముల్లులాగా మెదిలింది.